https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 PM TO 10 PM

సంపుటి: 01 / సంచిక:31 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 16,2026



## డా. వలిగొండ నరసింహకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అభినందనలు..

**ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 16:**

ఉస్మానియా యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవంలో పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా సాధించిన డా. వలిగొండ నరసింహను పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ప్రత్యేకంగా అభినందించారు..ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ సామాజిక స్పృహతో విద్యార్థి నాయకులు చేపట్టే పరిశోధనలు సమాజానికి ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. మాదిగ, దళిత, బహుజన విద్యార్థి ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన డా. వలిగొండ నరసింహ ఉన్నత విద్యలో రాణించి పరిశోధనా రంగంలో డాక్టరేట్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యతో పాటు సామాజిక అంశాలపై పరిశోధనలు కొనసాగించడం ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# తక్షణమే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోండి

## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 16:**

ప్రతిపక్ష నేత కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబంపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుప్పించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్‌పై విచారణకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని.. విచారణ జరపకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 రోజుల్లో విచారణ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌కు ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ఫాంహౌస్ ఆధీనంలో 700 ఎకరాలు ఉందని.. ఫాంహౌస్ భూమిని తేల్చాలని కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. 30 రోజుల్లోనే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి భూమి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామన్నారు. ఏ భూమినైతే శుద్ధి చేశారో అదే భూమికి ఎస్సీలను యజమానులను చేస్తామని ప్రకటించారు. కేసీఆర్‌కు తక్షణం నోటీసులు ఇచ్చి భూమి స్వాధీనం చేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సత్యం స్కాంలో ఉన్న భూముల్లోనే కేటీఆర్ ఫాంహౌస్ ఉందన్నారు. సత్యం స్కాంలో ఉన్న భూములు.. కేటీఆర్ బంధువుల పేరుతో బదిలీ అయ్యాయని చెప్పారు. సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్ రావు ఫాంహౌస్‌కు రోడ్లు వేయించినట్లు తెలిపారు. ఇరిగేషన్‌కు తీసుకున్న భూమిలోనే హరీశ్ రావు ఫాంహౌస్ ఉందన్నారు. హైదరాబాద్ బాలానగర్‌లో 120 ఎకరాలను హరీశ్ రావు కుటుంబ సభ్యులు కొల్లగొట్టారని ఆరోపించారు. ఫిర్యాదు చేయడానికి కూడా బాధితులు భయపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం, ధరణిని అడ్డుపెట్టుకుని దోపిడీ చేశారని సీఎం ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి పేరు మీద ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయనే వివరాలను అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారు. కల్వకుంట్ల ఫ్యామిలీకి 440 ఎకరాల భూమి, కేసీఆర్ దంపతుల పేరిట 67 ఎకరాలు, కేటీఆర్ కుటుంబంలో నలుగురి పేరుతో 123 ఎకరాలు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే కేటీఆర్ పేరుపై 49.5 ఎకరాలు, శైలిమ పేరుపై 17.5 ఎకరాలు, అలేఖ్య పేరుపై 9.38 ఎకరాలు, హిమాన్షు పేరుమీద 46.3 ఎకరాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా హరీశ్ రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాలు, సంతోషరావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావు పేరుపై 52 ఎకరాలు, కొండల్‌రావు పేరుపై 48 ఎకరాల భూమి ఉందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

- ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచి పెడతాం
- ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే బీఆర్ఎస్ భూముల చిట్టా విప్పారు
- అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ కు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారా
- కేసీఆర్ ఫాంహౌజ్ లో సర్కార్ భూమి ఉందని తేల్చడానికి 33 నెలలు పట్టిందా?
- భూముల విచారణ పేరుతో బీఆర్ఎస్ తో కాంగ్రెస్ చీకటి ఒప్పందం ఖాయం
- యూపీ ఎన్నికల కోసం అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సర్ధడం తథ్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 16:**


కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో దండ యాత్ర చేస్తామని ప్రకటించారు. ఆ భూముల్లో కాషాయ జెండా ఎగరేసి పేదలకు పంచి పెడతామని చెప్పారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ భూదోపిడీని సీఎం ప్రస్తావించడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. యూపీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే అసెంబ్లీలో బీఆర్ఎస్ భూదోపిడీని ప్రస్తావించి ఆ పార్టీతో బేరసారాలకు సిద్ధమయ్యారని చెప్పారు. ఈరోజు కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్ లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో పర్యటఇంచి గణేశ్ నిమిజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు జరుపుకునేలా గణేష్ నిమజ్జన ఏర్పాట్లను చేయాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే...కరీంనగర్ లో గణేశ్ నిమజ్జన ఉత్సవాల కోసం రూ.1.5 కోట్లను కేటాయించాం. గతేడాదితో పోలిస్తే మూడింతలు ఎక్కువ నిధులు కేటాయించాం. కరీంనగర్ ను కాషాయ మయం చేస్తాం. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచుతాం. మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేస్తాం. నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా 3రోజుల ముందే నీళ్లను విడుదల చేయాలి. ప్రజల సెంటిమెంట్ తో ఆటాలాడితే సహించే ప్రసక్తే లేదు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ప్యాచ్ వర్క్ కూడా పూర్తయ్యింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆనందోత్సవాలతో నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలి. హంగు అర్భాటాలతో ఉల్లాసంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిమజ్జన ఉత్సవాలు నిర్వహిస్తాం.అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తోంది.

- నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచన
- పోలవరం ప్రాజెక్టు ను సందర్శించిన పీపీఏ బృందం

## పనుల పురోగతిపై పీపీఏ సంతృప్తి

**అమరావతి,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు15**

సెప్టెంబర్ 16: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజీవ్ వోహ్రా నేతృత్వంలోని బృందం బుధవారం పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1,2 ల్లో జరుగుతున్న వివిధ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం.. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పనులను పూర్తి చేసేందుకు వేగం పెంచాలని సూచించింది. పీపీఏ సభ్య కార్యదర్శి రఘురామ్, జలవనరుల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ కె. నరసింహమూర్తి, పర్యవేక్షక ఇంజినీర్ పి. రామచంద్రరావు తదితరులు బృందంలో ఉన్నారు. నిర్మాణ ప్రాంతంలో వివిధ విభాగాల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సంస్థ ఏంఈఐఎల్ , జలవనరుల శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.



## విద్యార్థులు మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 16:**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాం గాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.



## సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆరుగురు విద్యార్థుల మృతి ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 16:**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామ శివారులో గణేష్ నిమజ్జనం సందర్భంగా శిరీష చారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో చిన్నారులను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని

మొదటిపేజీ తరువాయి

# బీజేపీ దండయాత్ర

బీఆర్ఎస్ కు సంబంధించి 8గురు ఎమ్మెల్యేల భూభాగోతం గురించి మాట్లాడటానికి గంట సమయం పట్టింది. మరి 90 మంది ఎమ్మెల్యేల భూభాగోతం గురించి మాట్లాడాలంటే ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలి. తెలంగాణలో 60 శాతం మంది ప్రజలకు భూముల్లేవు. 25 లక్షల కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడాని గజం జాగా కూడా లేదు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం వేల ఎకరాల భూములను దోచుకున్నారు. పాదయాత్రలో నేను బీఆర్ఎస్ భూదోపిడీ గురించి మాట్లాడితే కేసీఆర్ నా తలను 6 ముక్కలు చేస్తానన్నారు. అయినా కేసీఆర్ మెడలు వంచి ఫాంహౌజ్ నుండి గుంజుకొచ్చి ప్రజల ముందుంచిన. బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని చెప్పడానికి వెయ్యి రోజులు పట్టిందా సీఎంగారు. బీఆర్ఎస్ నేతలతో డీల్ కుదరలేదా?. ఏఐసీసీకి కట్టాల్సిన ఈఎంఐ గడువు ముంచుకొస్తుండటంతో ఒత్తిడి పెరిగిందా. అసెంబ్లీ వేదికగా వివరాలు బయటపెట్టి బీఆర్ఎస్ నేతలకు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారా?. అసెంబ్లీ సాక్షిగా సిట్ పేరుతో మీరు నియమించిన విచారణ కమిటీలు ఏమయ్యాయి?.బేరాలు కుదరగానే సిట్ ను నీరుగార్చడం సీఎంకు అలవాటే కదా. సీఎం సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ లా కమిటీలు మారాయి. ఈ భూములపై కూడా విచారణ పేరుతో ఇంకెన్నాళ్లు లాగుతారు. జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలిస్తే... 24 గంటల్లో పూర్తి నివేదిక ఇస్తారు. 30 రోజుల గడువు పేరుతో డీల్ కుదుర్చుకోవాలనుకుంటున్నారా.విద్యుత్ కొనుగోళ్లు, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల స్కాంసహా కేసులన్నీ ఏమయ్యాయి?. ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన వాళ్లపై చర్యలేవి. పేదలు ఫారెస్ట్ ల్యాండ్స్ లో సాగు చేస్తే నానా ఇబ్బందులు పెడతారు కదా. వందల ఎకరాల ఫారెస్ట్ భూమిని కబ్జా చేస్తే చర్యలేవి.తెలంగాణను అభివృద్ధి చేయాలని మోదీ తాపత్రయపడుతున్నారు. అందులో భాగంగా బుల్లెట్ ట్రైన్లను మంజూరు చేస్తే... వాటికి కేటాయించిన భూములను సైతం బీఆర్ఎస్ కబ్జా చేశారు. బీఆర్ఎస్ వేల ఎకరాల భూములను దోచుకుంటే... వాళ్లతో బేరాలాడటమే మీ పనా?. కేసీఆర్ ఫాంహౌజ్ లో ప్రభుత్వ భూమి ఉందని తెలియడానికి 33 నెలలు పట్టిందా. రూ.లక్షల కోట్ల విలువైన ఆ భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదులిఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే బీఆర్ఎస్ భూముల చిట్టా విప్పారని ప్రజలకు అర్ధమైంది. భూముల విచారణ పేరుతో బీఆర్ఎస్ తో చీకటి ఒప్పందం ఖాయం. యూపీ ఎన్నికల కోసం అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సర్దడం తథ్యం. బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ దండయాత్ర చేస్తాం. ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచి పెడతాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే.సీఎం మాట చెబితేనే అది శాసనం కావాలి. కానీ బీఆర్ఎస్ తో బేరసారాల కోసం భూదోపిడీని వాడుకోవడం సిగ్గు చేటు. తెలంగాణ ప్రజలు ఛీకొడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందాలపై జనం తిరగబడే రోజులు రాబోతున్నాయి. బీజేపీ ఆధ్వర్యంలో అతి త్వరలోనే బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూములపై దండయాత్ర చేస్తాం. ఆ భూములను పేదలకు పంచిపెడతాం.

మొదటిపేజీ తరువాయి

## సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆరుగురు విద్యార్థుల మృతి ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి

నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తల్లిదండ్రులు కూడా గణేష్ నిమజ్జనాల సమయంలో తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పిల్లలు చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

మొదటిపేజీ తరువాయి

## పనుల పురోగతిపై పీపీఏ సంతృప్తి

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

ప్రాజెక్టు పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పీపీఏ దృష్టికి తీసుకురావాలని అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులకు వారు సూచించారు. అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం కోసం పీపీఏతో సంప్రదిస్తూ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పనుల వేగానికి ఆటంకం కలిగించే అంశాలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు.జలవనరుల శాఖ ఈఈలు కే బాలకృష్ణ, బి దామోదర్, డి శ్రీనివాస్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్ ) జనరల్ మేనేజర్ ఎ. గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి తదితరులు పీపీఏ బృందానికి ప్రాజెక్టులో జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. ఆయా నిర్మాణ ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, వాటి ప్రస్తుత స్థితి, మున్ముందు చేపట్టాల్సిన పనులపై వివరాలు అందించారు.

సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరిశీలన

పీపీఏ బృందంతో కలిసి, అనంతరం విడిగా సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం కూడా ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించింది. గ్యాప్ 1,2 లలో పీ పీ ఏ తో పాటు సీఎస్ఎంఆర్ఎస్ బృందం నిపుణులు హరేంద్ర ప్రకాశ్, దీపముద్ర నాయక్, శాస్త్రవేత్త గౌరవ్ పాండే తదితరులు పర్యటించారు. ప్రాజెక్టులో మట్టి, రాయి నాణ్యత, తేమ శాతం పరిశీలించారు . గురువారం కూడా వీరు పరీక్షలు నిర్వహించనున్నారు. జలవనరుల శాఖ నాణ్యత విభాగం డీఈలు శివప్రసాద్, మల్లికార్జున, ఎంఈఐఎల్ నాణ్యత నియంత్రణ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ శంకరయ్య ఈ బృందం వెంట ఉన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త...

### మంచిర్యాలలో దారుణ ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

### కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50–55 కోట్లకు చేరిందని తెలిపారు.

## ఉప్పు ఉత్పత్తికి నెలకొన్న సంక్షోభం!

### వాతావరణ మార్పులతో ఆటంకం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

వాతావరణ మార్పుల ప్రభావం దేశంలోని కీలక రంగాలపై తీవ్రంగా పడుతోంది. తాజాగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఉప్పు ఉత్పత్తిదారుగా ఉన్న భారత్‌లో ఈ సంక్షోభం స్పష్టంగా కనిపిస్తోంది. అకాల వర్షాలు, తరచూ సంభవిస్తున్న తుపానులు, రుతుపవనాల తీరులో మార్పులు వంటి కారణాలతో ఉప్పు ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా దేశంలోనే అత్యధికంగా ఉప్పును ఉత్పత్తి చేసే గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లోని ఉప్పు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. భారత్‌లో ఏటా సగటున 30.7 మిలియన్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఇందులో సింహభాగం, అంటే దాదాపు 85 నుంచి 87 శాతం గుజరాత్ నుంచే వస్తుంది. సంప్రదాయబద్ధంగా సముద్రపు నీటిని గానీ, భూగర్భంలోని ఉప్పునీటిని గానీ విశాలమైన మడుల్లోకి (ప్యాన్‌లు) పంపి, సూర్యరశ్మికి ఆవిరయ్యేలా చేయడం ద్వారా ఉప్పును తయారు చేస్తారు. ఈ ప్రక్రియకు సుదీర్ఘమైన పొడి వాతావరణం, తగినంత సూర్యరశ్మి అవసరం. వర్షపాతం వీలైనంత తక్కువగా ఉండాలి. కానీ, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ప్రక్రియకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లోని కచ్ ఎడారి ప్రాంతం, తమిళనాడులోని తూత్తుకుడి, మరక్కాణం వంటి తీరప్రాంతాల్లోని ఉప్పు క్షేత్రాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. అకాల వర్షాలు కురవడం వల్ల మడుల్లోని ఉప్పునీటి గాఢత తగ్గిపోతోంది. దీంతో నీరు ఆవిరయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొన్నిసార్లు, తయారైన ఉప్పు స్ఫటికాలు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి కాలం తగ్గిపోవడమే కాకుండా, దిగుబడి కూడా గణనీయంగా పడిపోతోంది. గుజరాత్‌లో రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభం కావడం లేదా ఎక్కువ కాలం కురవడం వల్ల ఉప్పు తయారీ సీజన్ ఆలస్యమవుతోంది. తమిళనాడులోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో, కొన్నిసార్లు అక్కడి వ్యాపారులు గుజరాత్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. లిటిల్ రాణ్ ఆఫ్ కచ్‌లోని ఉప్పు రైతులపై 2026లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. మారుతున్న వర్షపాత సరళి, విపరీతమైన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయని తేలింది. ఉష్ణోగ్రతలలో మార్పులు కూడా నీరు ఆవిరయ్యే వేగాన్ని, స్ఫటికాల ఏర్పాటును ప్రభావితం చేస్తున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. తీర ప్రాంతాల్లో తుపానులు, బలమైన గాలులు మరో పెను సవాలుగా మారాయి. రైతులు తమ మడుల చుట్టూ గట్లు నిర్మించుకుని రక్షణ చర్యలు తీసుకుంటున్నా, అవి పెద్ద వర్షాలు, వరదల ముందు నిలవలేకపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పరిశోధనా సంస్థలు ప్రత్యామ్నాయ టెక్నాలజీలపై దృష్టి సారించాయి. ప్రతికూల వాతావరణంలోనూ నీటిని వేగంగా ఆవిరి చేసే పద్ధతులపై ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే, ఈ టెక్నాలజీలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశీయ ఉప్పు ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం

### భారత్‌తో భారీ డీల్ కుదుర్చుకున్న న్యూజిలాండ్

### 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గించే చాన్స్!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

### రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## జీరం ఘాటీ నరమేధం కేసులో మరణశిక్ష

### 10 మంది మావోయిస్టులకు శిక్ష విధిస్తూ చారిత్రక తీర్పు

బస్తర్, సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సౌదీకి హుతీల మరో భారీ షాక్..!

### అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

పశ్చిమాసియాలో సౌదీ అరేబియా–హుతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హుతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్–మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్ధంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్–15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

### కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

### 51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(త్రినేత్ న్యూస్, ):

దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136